# నిమిత్త మాత్రులు

పోస్టుమాన్ కవరు అందించి వెళ్లాడు. ఆత్రుతగా విప్పి చదివా. అపాయింట్‌మెంట్ ఆర్డర్! నా ఆనందానికి అవధుల్లేవు. ఊహాలోకంలో చాలసేపు విహరించాను. ఢిల్లీలో ఉద్యోగం. జీతం తొమ్మిదివందలు పైనే ఉంటుంది. అమ్మనీ, చెల్లెల్నీ, తమ్ముళ్లనీ బెజవాడలోనే కొంతకాలం ఉంచాలి! తమ్ముళ్లకి బాగా చదువులు చెప్పించాలి. తాను చాల క్లుప్తంగా గడుపుకోవాలి. తల్లికి నెల నెలా మూడువందలు పంపితే ఎలాగో కాలక్షేపం చేసుకొంటారు. నెలకు కనీసం నాలుగు వందలయినా మిగిల్చి బేంక్‌లో వేయాలి. మంచి సంబంధం చూసి చెల్లికి పెళ్లి చేయాలి. ఆ తర్వాత తన పెళ్లి గురించి ఆలోచించాలి. ఇంకా ఏవేవో ఊహలు.....!

"ఏవిట్రా బాబూ! అలా ఉన్నావ్?" అమ్మ పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చాను. అమాంతంగా అమ్మను కౌగలించుకొన్నా. నా చేష్టలకి ఆమె కంగారుపడింది. అసలు విషయం విని ఆనందంతో తబ్బిబ్బయింది.

"వెంటనే ఢిల్లీ వెళ్లాలమ్మా!" అన్నా.

"ఉద్యోగంలో చేరడానికి మామయ్య డబ్బు సాయం చేస్తానన్నాడు కదరా!" జ్ఞాపకం చేసింది అమ్మ.

"అవును! డబ్బు సర్దుతానన్నాడు మామయ్య!"

ఈ శుభవార్త ఇరుగుపొరుగు వారికి చేరవేయడానికేమో, అమ్మ అక్కడనుండి నిష్క్రమించింది.

చేతిలో రూపాయి డబ్బుల్లేవు! అయినా విచారం లేదు! మామయ్య వాగ్దానం చేశాడు. తొందరగా వెళ్లి నలుగురి స్నేహితులతో చెప్పాలి. ముందుగా రమేష్ జ్ఞాపకానికి వచ్చాడు. రమేష్ మా శ్రేయోభిలాషి! మా నాన్నగారి ప్రియ శిష్యుడు. అతణ్ణి ముందు కలవాలి. సైకిలు అద్దెకు తీసుకొని పూర్ణానంద పేటకు

బయలుదేరాను. రమేష్ ఇంటివద్దనే ఉన్నాడు. నాకు ఉద్యోగం వచ్చిందని తెలుసుకొని ఇంటిల్లిపాదీ అమితానందం పొందారు. రమేష్ నాన్నగారు పంచాంగం తీసి, "ఎల్లుండి ఉదయం నాలుగ్గంటలకీ - ఎనిమిది గంటలకీ మధ్యకాలం చాల మంచిది!" అని నా ప్రయాణానికి ముహూర్తంకూడా పెట్టారు.

"అయితే ఎల్లుండి జయంతీ జనతా ఎక్స్‌ప్రెస్‌కి బెర్తు రిజర్వు చేయిస్తాను" అన్నాడు రమేష్. అతను రైల్వే బుకింగ్ ఆఫీసులోనే పని చేస్తున్నాడు. కాబట్టి రిజర్వేషన్ సంపాదించడం అతనికి కష్టమేమీ కాదు. రాత్రి హౌరా ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం వెళ్లి మామయ్య దగ్గరనుండి డబ్బు తెచ్చుకొని వస్తానని చెప్పి బయలుదేరాను.

తెలతెలవారుతుండగా బండి వాల్తేరు చేరుకొంది. విశాఖపట్నం నాకంతగా తెలియదు. పది సంవత్సరాల క్రితం స్నేహితుని పెళ్లికి వెళ్లాను ఒకసారి. రైల్వేస్టేషన్ ఎంతగానో మారిపోయింది. ఒక సిటీ బస్సుని పట్టుకొని మామయ్యగారింటికి వెళ్లా. వారిల్లు తెల్సుకోవడానికి ఎక్కువుగా శ్రమపడాల్సిన అవసరం లేకపోయింది. తెల్లవారేసరికి ఊడిపడిన నన్ను చూసి వారు దిగ్భ్రాంతి చెందారు. తర్వాత నే చెప్పిన విషయాన్ని తెల్సుకొని చాల సంతోషించారు. సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి వెళ్లాలనీ, మర్నాడు జయంతీ జనతాలో ఢిల్లీ వెళ్లాలనీ చెప్పాను. "అలాగే, తప్పకుండా వెళ్దువుగాని" అన్నాడు మామయ్య. భోజనంచేసి ఆఫీసుకెళ్తూ కొంతసేపు విశ్రాంతి తీసుకొని పన్నెండు గంటలకల్లా నన్ను ఆఫీసుకు రమ్మన్నాడు. బాంక్‌లో డబ్బుతీసి ఇస్తానన్నాడు. మామయ్య వెళ్లాక మంచంమీద మేను వాల్చాను. రాత్రి ప్రయాణంలో నిద్ర లేకపోవడం వల్ల నిద్ర ముంచుకొస్తోంది. అత్తయ్య చెప్పే మాటలు అక్కడక్కడా నా చెవిలో పడుతున్నాయ్. కొంతసేపు వూఁ కొట్టి నిద్రలో మునిగిపోయాను. పదకొండున్నరకల్లా అత్తయ్య నన్ను నిద్ర లేపింది. సిటీ బస్ ఎక్కి కలెక్టరాఫీసు స్టాపులో దిగితే అక్కడే మామయ్య ఆఫీసు అని చెప్పింది.

మామయ్య ఆఫీసులోకి అడుగుపెట్టేసరికి 12.30 అయింది. నన్ను కూర్చోమని ఒక కుర్చీ చూపించి తన పని తాను చూసుకొంటున్నాడు మామయ్య. పావుగంట గడిచింది. వాచీని మరోసారి చూసుకొన్నా. అంతలోకి ఒక పెద్దమనిషి వచ్చాడు. వయస్సు 50 దాటి ఉంటాయ్. పంచ, లాల్చీపై మీద కండువా,

పాతకాలపు మనిషి. ఆఫీసు సూపరింటెండెంటును కలిశాడు. ఆయనను చూడగానే మామయ్య దగ్గరకు వెళ్లమన్నట్లుగా సైగ చేశాడు సూపరింటెండెంటు.

మామయ్యను సమీపించి సవినయంగా నమస్కరించాడా పెద్దమనిషి.

"బాబూ! అమ్మాయి పెళ్లికి ఇంకా వారంరోజులే టైం ఉంది. కట్నం ఎల్లుండే ఇస్తానని వాగ్దానం చేశాను; పి.ఎఫ్ అడ్వాన్సుకి అప్లై చేసి మూడువారాలు దాటింది. డబ్బు చాలా అవసరం" అన్నాడు ఆర్ద్రంగా.

పనిని కట్టిపెట్టే ప్రయత్నంలో ఉన్న మామయ్యకి అతని మాటలు చికాకు కలిగించాయ్.

"చూడండీ, జానకిరామయ్యగారూ! ఇది నా సీటు కాదు! అర్జంటు ఫైల్స్ చూడమని నన్నిక్కడ కూర్చోబెట్టారు. ఈ సీటు వెంకటేశం మూడు రోజులు సెలవు పెట్టాడు. అతను వచ్చాక రండి!"

పుల్లవిరిచినట్టుగా చెప్పాడు మామయ్య. ఆ పెద్దమనిషి మొఖంలో నెత్తురు చుక్కలేదు. మొఖానికి పట్టిన చెమట కండువాతో తుడుచుకొన్నాడు. ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. కానీ అవకాశం ఇవ్వలేదు మామయ్య. సీటులోనించి లేచి ఫెయిర్‌కాపీ ప్యాడ్స్ తీసుకొని ఆఫీసరుగారి గదిలోకి వెళ్లాడు.

రెండు నిముషాల్లో తిరిగి వచ్చి నన్ను బయలుదేరమని సైగ చేశాడు.బతుకుజీవుడా అనుకొంటూ లేచాను. కానీ నా దృష్టి అంతా ఆ పెద్దమనిషి మీదనే. మేమాఫీసు మెట్లు దిగుతుంటే మా వెనకనే వచ్చారాయన.

"బాబూ! విశ్వనాథంగారూ!" పిలిచాడాయన.

వెనక్కి తిరిగి ఈసడింపుగా చూశాడు మామయ్య.

"నా అడ్వాన్సు సంగతి ఏమీ తేల్లేదంటారా?" ఆత్రంగా అడిగాడాయన.

"ఏమో సార్! నేనా సీటు వాణ్ణికాదు. ఎల్లుండి వెంకటేశం వస్తాడు, కనుక్కోండి!" అనేసి గబగబా అడుగులు వేయనారంభించాడు మామయ్య. ఆయన నిశ్చేష్టుడయ్యాడు.

కొంతదూరం వెళ్లాక మామయ్య అన్నాడు.

"ఆయనకు అడ్వాన్సు శాంక్షన్ అయింది. ఆర్డరు సంతకానికి ఆఫీసరు దగ్గరకు వెళ్లింది.

"ఆ విషయం చెప్పలేకపోయావా మామయ్యా! పాపం అమ్మాయి పెళ్లట!" జాలి పడ్డాను.

"నీకిది కొత్తగానీ, ఇవి మాకెప్పుడూ ఉండేవేరా! మా లోన్లూ, అడ్వాన్సులు చాలవరకూ బోగస్. వీరి విషయం నాకు తెలియదనుకో! అయినా ఆ సీటు నాది కాదు. నేనెందుకు చెప్పడం? ఆఫీసు విషయాలు తెలుసునని అందరితోనూ వాగెయ్యకూడదు! తెలుసా?" హెచ్చరించాడు.

"అవును కాబోలు!" అనుకున్నా.

మేము బ్యాంక్‌లో అడుగుపెట్టేసరికి రెండు గంటలు కావస్తుంది. చాల రద్దీగా ఉంది. కాలేజీలు తెరిచారు, స్టూడెంట్లు ఎక్కువగా ఉన్నారు. కౌంటర్ క్లర్క్ ప్రక్కనున్న వారితో ఏదో విషయం గురించి చర్చిస్తున్నాడు. మమ్మల్ని చూసినా పట్టించుకోలేదు. అందుబాటులో ఉన్న ఫారాన్ని తీసి నింపి పాస్ పుస్తకాన్ని చేత పట్టుకుని నిలుచున్నాడు మామయ్య. ఆ గుమాస్తా దృష్టిని తన వైపు మరల్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆలస్యం అయితే టైమయిపోయిందంటాడేమోనన్న బెంగ నాకు పట్టుకుంది.

"ఎక్స్‌క్యూజ్ మీ!" అన్నా కొంచెం గట్టిగా. డిస్టర్బెన్సుకు కోపంగా చూశాడా క్లార్కు. అయితే ఏమీ అనలేదు. మామయ్య చేతిలో ఉన్న ఫారాన్ని, పాస్‌బుక్కునీ అందుకొని పేపర్‌వెయిట్ కింద పెట్టి మరలా ప్రక్క వారితో చర్చకు దిగాడాయన. వారు చర్చించే విషయం బ్యాంక్ రూల్స్ గురించే కావచ్చు, కానీ మా పని చూసిన తర్వాత తీరుబడిగా తర్జన భర్జన చేసుకోవచ్చుగా, మరో నిమిషం చూసి అడగాలనుకొన్నా, అడగలేకపోయా. అయిదు నిమిషాలు గడిచాయి. గోడగడియారం రెండు గంటలు చూపుతోంది. ఆయన సీటులోంచి లేచే ప్రయత్నంలో ఉన్నాడు. నాలో సహనం సన్నగిల్లింది.

"మా పని చూడండి సార్! చాల పని ఉంది!" అన్నా సాధ్యమైనంత సౌమ్యంగా.

ఆయన నా వైపు చిరాగ్గా చూశాడు.

"మీరొచ్చి ఏంత సేపయిందండీ? రెండు నిముషాలు కూడా కాలేదు! తొందరపడితే ఎలా?" విసుక్కున్నాడు.

"అది కాదు సార్! మావాడు గోదావరిలో బెజవాడ వెళ్లాలి. ఇంకా బజారులో చాలా పని ఉంది. దయచేసి మమ్మల్ని పంపించి మీ పని చూసుకోండి!" వినయపూర్వకంగా అర్థించాడు మామయ్య.

అయన ఛటాలున లెడ్జరు తీసి ఎంట్రీ వేసి ప్రక్కనున్న రేక్‌పై దబాల్న పడేశాడు. తన పని అయిపోయినట్లుగా మా వైపు చూసి ఒక టోకెన్‌ను మామీదకు విసిరాడు. ఆ తర్వాత లోనికి పోయాడు. బహుశా రూల్సు గురించి ఆఫీసరునుంచి క్లారిఫికేషన్‌ను అడగడానికై ఉంటుంది.

మామయ్యా నేను మొహమొహాలు చూసుకొన్నాం. ఆ లెడ్జరు అక్కడనుండి ఎకౌంటెంట్‌గారి దగ్గరకు కదలాలి. ఎలా?

మెసెంజర్ వచ్చి దాన్ని కదపాలి. నా కళ్లు బ్యాంక్ అంతటినీ వెతికాయి. ఎక్కడా మెస్సెంజర్ అన్నవాడు కనపడలేదు. మేము లోనికి వెళ్లకూడదు. మామయ్య టోకెన్‌ను జేబులో ఉంచుకొని పేమెంట్ కౌంటర్ దగ్గరకు నడిచాడు. నేను మాత్రం అడుగు కదపలేదు. మెసెంజర్ దర్శనం కోసం చూస్తున్నాను. మా అదృష్టవశాత్తు వరండాలో హడావుడిగా తిరుగుతున్న ఒక మెసెంజర్ కనిపించాడు. గబగబా అడుగులు వేసి అతన్ని సమీపించా.

"మా ఎస్.బి. లెడ్జర్ కాస్త ఎకౌంటెంటుగారి టేబిల్ మీద పెడుదూ!" అన్నా బతిమాలే ధోరణిలో.

ఆ మెసెంజర్ నన్ను ఒక పురుగుని చూసినట్టు చూశాడు.

"నేనా సెక్షన్ వాణ్ణి కాదు సార్! అదిగో అక్కడ తీరుబడిగా సిగిరెట్లు

కాల్చుకుంటున్నారే! అడగండి!" డైరెక్షన్ ఇచ్చాడు.

అటువైపు చూశా. సైకిల్ స్టాండ్ దగ్గర ఇద్దరు మెసెంజర్లు నిలబడి సిగిరెట్లు కాల్చుకుంటున్నారు. గత రాత్రి తాము చూసిన సినిమాగురించి మాట్లాడుకుంటున్నారు. నన్ను చూసిచూడగానే వారిలో ఒక హిప్పీ యువకుడు.

"ఏం సార్? ఏం కావాలి?" అడిగాడు అతి వినయంగా. ఆ తర్వాత నా విజ్ఞప్తిని విని మౌనం వహించాడు.

"మేం డెవలెప్‌మెంట్ బ్రాంచి వాళ్లం సార్!" చెప్పాడు రెండో వ్యక్తి.

నిర్విణ్ణుడయ్యాను. టైం రెండు గంటలు దాటింది. ఇంకా బజారుకెళ్లి సామాన్లు కొనుక్కోవాలి. సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను క్యాచ్ చేయాలి.

"దయచేసి కొంచెం సాయం చేయండి! చాల అర్జంటు పని ఉంది.!" మరోసారి అర్ధించాను.

"భలేవారు సార్! ఆ డ్యూటీ మాది కాదు! దానికై ముగ్గురున్నారు లోపల!" నిర్లక్ష్యంగా అన్నాడా హిప్పీ యువకుడు.

"అక్కడెవరూ కనబడలేదు. అందుకే మిమ్మల్ని రిక్వెష్టు చేస్తున్నా!" అన్నా నిస్పృహగా.

"మేం ఎక్కడవుంటే అక్కడికి ఇలా వచ్చేస్తే ఎలా సార్! వెళ్లి పేమెంట్ కౌంటర్ దగ్గర ఉండండి. టోకెన్ ఇచ్చారా?" విసుక్కున్నాడు హిప్పీవాలా.

మారు మాట్లాడకుండా తిరిగి బ్యాంక్ వరండా చేరుకొన్నా. మామయ్య పేమెంట్ కౌంటరు దగ్గరున్న పొడుగాటి బెంచీ మీద కుర్చొని ఉన్నాడు. లెడ్జరు కౌంటర్ దగ్గరే తిష్ట వేసుకొని కూర్చుని ఉంది. టైం చూసుకొన్నా. రెండూ ఇరవై నిముషాలైంది. కౌంటర్ క్లార్క్ తిరిగివచ్చి తన సీటులో కూర్చున్నాడు.

"సార్! మా లెడ్జర్ ఇంకా ఇక్కడనే ఉంది!" అన్నా, ధైర్యంగా.

నా మాటలకి ఆశ్చర్యం ప్రకటించాడు. అప్పుడే కాఫీ తీసుకొని వచ్చాడు క్లబ్ బోయ్.

"ఒరేయ్! అవతల చంద్రరావుగాని, గారప్పగానీ ఉంటారు, కేకేయ్."

ఆ కుర్రవాడికి పురమాయించాడు, వాడు బయటకు వెళ్లి మరు నిమిషంలో చంద్రరావుని లాక్కొని వచ్చాడు. చంద్రరావు ఎవరో కాదు. ఆ హిప్పీ యువకుడే.

"ఏం సార్! పిలిచారా?" అడిగాడు అసహనంగా

"లెడ్జరుని ఎకౌంటెంట్‌గారి దగ్గరవుంచవయ్యా! చాల సేవయింది!" విసుక్కున్నాడు గుమాస్తా.

ఆ చంద్రరావ్ నా వైపు కోపంగా చూశాడు.

"ఇప్పుడేకద సార్ బయటకు వెళ్లాను!" గొణుక్కుంటూ కదిలాడు.

ఎట్టకేలకు డబ్బుతీసుకొని బయటకు వచ్చాం. సిటీ బస్సు కోసం నిరీక్షిస్తే కాలం వృథా అవుతుంది. రిక్షాలో బజారు చేరుకొన్నాం. ఒక షాపులోనికి వెళ్లాం. కస్టమర్స్‌తో కిటకిటలాడుతోంది. కొద్దిగా ఖాళీగా ఉన్నాడనిపించిన ఒక సేల్స్‌బాయ్ దగ్గరకు వెళ్లి 'హోల్డాల్సు' చూపించమన్నాను.

అంతకు ముందు బేరం కోసం తీసిన అద్దాలనీ, పౌడర్ టిన్నుల్నీ, టూత్ బ్రష్‌ల్నీ ఒక్కొక్కటి తీసి వెనుకనున్న బీరువాలో సర్దుతున్నాడా కుర్రవాడు. నా అభ్యర్థన వినిపించనట్లుగా ఉంది అతని ప్రవర్తన.

"మిస్టర్! హోల్డాల్సు చూపించు!" అన్నా ఆలస్యాన్ని భరించలేక.

పల్లెటూరి రైతుని చూసినట్లుగా నన్నొకసారి చూసి ఎదురుగాఉన్న మరొక సేల్సుమెన్‌ని చూపించాడు, మూగవాడిలా.

"అతను చాల బిజీగా ఉన్నాడు!నువ్ చూపిద్దూ!" అన్నా రిక్వెస్టింగ్‌మూడ్‌లో.

అతను ప్రసన్నం కాలేదు.

"హోల్డాల్సు అతనే చూపిస్తాడు, సార్! దయచేసి అక్కడికే వెళ్లండి!" అనేసి అప్పుడే వచ్చిన కస్టమర్‌కి ఎటెండ్ కావాడానికి ఉపక్రమించాడు.

ఆ రెండో సేల్స్‌మెన్ చాల బిజీగా ఉన్నాడు. అంతా అతని చుట్టూ మూగి అతని ఓర్పుని పరీక్షిస్తున్నారు.

ఇక లాభంలేదని కాష్ దగ్గరున్న ప్రొప్రయిటర్‌ని కలిశా.

"చాల అర్జంటు పని ఉంది! దయచేసి హోల్డాల్సు చూపమనండి!" అన్నా.

"అలా వెళ్లండి! అతను చూపిస్తాడు! కొంచెం ఆలస్యం అవుతుంది! మంచి క్వాలిటీ లోపల ఉన్నాయ్! తేవాలి!" అంటూ ఆ బిజీగా ఉన్న సేల్స్‌మేన్నే చూపించాడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది.

"మరో షాపుకి పోదాం మామయ్యా!" గట్టిగా ప్రొప్రయిటర్‌కి వినిపించేలా అన్నా.

నా మాటలు విన్నా ఆ ప్రొప్రయిటర్ ఏమాత్రం ఖాతరు చేయలేదు. బేరం అంటే లక్ష్యంలేదు.

"ఈ సీజన్లో ఈ టైం అప్పుడు అన్ని షాపులూ ఇలాగే ఉంటాయిరా!" అన్నాడు మామయ్య.

ఆ తర్వాత అన్నాడు ప్రొప్రయిటర్.

"మంచి వెరైటీ కావాలంటే కొంచెం వెయిట్ చెయ్యాలి సార్!"

నేనేం మాట్లాడలేకపోయాను. హెూల్డాలూ అదీ కొనుక్కొని బయటపడేసరికి చాలా టైము పట్టింది. నా ట్రెయినుకి ఇంకా గంటన్నర టైముంది. రాత్రి భోజనం కుదరదు. ట్రెయినులో గడపాలి. టిఫిన్ చేయాలి! అనుకున్నాను.

" కాఫీ తాగుదాం రా!" అన్నాడు మావయ్య.

ఎదురుగా ఉన్న ఒక హోటల్‌లోనికి వెళ్ళాం. మన దేశంలో జనాభా అదుపు లేకుండా పెరిగి పోయిందనడానికి నిదర్శనం అక్కడనే కన్పిస్తూంది. ఎక్కడా కుర్చీలు ఖాళీలు లేవు. కొంతమంది నిలబడే కాఫీలు తాగేస్తున్నారు. ఐదు నిమిషాలు కాపు కాచి అతి కష్టంమీద ఎడ్జస్టు చేసుకొని రెండు వరస కుర్చీలను సంపాదించుకొన్నాం.

టిఫిన్ తిన్నాక తొందరగా స్టేషన్‌కు వెళ్లాలి. ట్రెయిన్‌లో సీటు దొరుకుతుందా?.

ఆలోచనలో పడ్డా. పది నిముషాలు గడిచాయ్. సర్వరు దర్శనం కాలేదు. ఎదురుగా ఒకడు కుర్చీలో కూర్చొని దోసెతింటున్నాడు. చెట్నీ కావాలి. సర్వరు రాకపోవడంతో అలాగే మిగిలిన ముక్కను తినేశాడు. మా పక్కన కూర్చున్న పాసెంజర్లు కూడా దైవదర్శనం కోసం నిరీక్షిస్తున్న భక్తుల్లా సర్వరు సాక్షాత్కారం కోసం తహ తహ లాడిపోతున్నారు. చాలా మంది సర్వర్లు టిఫెన్లు పట్టుకొని వస్తున్నారు గానీ, మావాడు మాత్రం రావడంలేదు.

పది నిమిషాలు దాటింది. విసుగెత్తింది.

"ఏవండీ? మన సర్వరెలా ఉంటాడు?. అడిగా చెట్నీ చాలకపోయినా దోసెను తినేసిన పెద్ద మనిషిని. ఆయన ఒక చిరునవ్వు విసిరాడు. "మనలాగే ఉంటాడు! వాడేం దేవతా దెయ్యం కాదే కనబడకపోవడానికి! అయితే చూడండీ! ఆ పెద్ద మనుషులిద్దరూ రెండు ఉల్లి దోసెలకి ఆర్డరిచ్చారు!. బహుశా వాటిని దగ్గరుండి కాల్పిస్తూ ఉండాలి!. అని కాలేవరకూ మన సర్వరు పాకశాలను వదలి బయటపడడు!"

చావు కబురు చల్లగా చెప్పాడు.

పక్కనే ఉన్న టేబులుకి చక చక టిఫిన్లు అందిస్తున్నాడొక సర్వారావు. చాలా చలాకీగా ఉన్నాడు, 'అప్పారావు' అని ఎవరో పిలుస్తూ ఉంటే విన్నా! ఆ అప్పారావు తిరిగి వెళ్లబోతూ ఉంటే ఆప్యాయత ఒలకపోస్తూ పిలిచా!

"అప్పారావు!" అతను ఠక్కున ఆగాడు. నా వైపు తిరిగి చిరు నవ్వులు చిందించాడు.

"ఏం సార్! బావున్నారా?" పలకరించాడు మహా తెల్సున్నవాణ్ణిలా.

"పూరీ, వడా, ఇడ్లీ-ఏవి రెడీగా ఉంటే అది రెండు ప్లేట్లు తెచ్చిపెడుదూ!" అన్నా తగ్గు స్వరంతో.

"ఆ టేబుల్సు నావి కాదు, సార్! అతనువస్తాడు" అనేసి అక్కడనుండి నిష్క్రమించాడు.

మా టేబుల్సు వాడి జూరిస్‌డిక్షన్‌లో లేవు కాబట్టి మాకు సర్వ్‌చేసే అవసరంగానీ, అధికారంగానీ వాడికి లేదన్న మాట?

మా అదృష్టవశాత్తూ అప్పారావు టేబుల్సులో రెండు కుర్చీలు ఖాళీ అయాయ్. చటాల్న లేచి ఆ కుర్చీలను ఆక్రమించుకున్నాం.

"అప్పారావు ఎలా తప్పించుకోగలడు?" అన్న మావయ్యతో ఏదో సాధించిన వానిలా.

"పోదాం రా! గోదావరికి టికెట్టు కొనడం చాలా కష్టం. పెద్ద క్యూ ఉంటుంది.!" అన్నాడు మావయ్య.

"అయితే ఒట్టి కాఫీ తాగేసి పోదాం!" అన్నా.

"ఐదు నిమిషాలు గడిచాయ్. మా దురదృష్టం కొద్దీ అప్పారావు కూడా అదృశ్యుడయ్యాడు. వీడు కూడా దోసెల పెనం దగ్గర పక్క వేశాడా? మేము వదులుకున్న సర్వరు వచ్చి దోసెలు అందించాడు. అందర్నీ పలకరించి ఏమేం కావాలో అవి అందిస్తున్నాడు. అక్కడ ఉన్నా బాగుండి పోయేది. 'గడుసువానికి పలచని గంజి' అన్న సామెత జ్ఞప్తికి వచ్చింది. ఎట్టకేలకు మా అప్పారావు దర్శనం ఇచ్చాడు. అయితే సర్వరులా రాలేదు. శుభ్రమైన బట్టలు వేసుకుని ట్రిమ్‌గా తయారయి వచ్చాడు.

"రెండు కాఫీ" నా మాటలు పూర్తి కాకుండానే నన్ను వారించి, "నా డ్యూటి అయిపోయింది, సార్! మరొకరు వస్తున్నాడు!" అన్నాడు.

"ఆరి పిడుగా!" అప్రయత్నంగా నా మాటలు పైకే వచ్చేసాయి.

"లే మావయ్యా! టిఫినూ వద్దూ, కాఫీ వద్దు. ఫ్లాట్‌ఫారమ్ మీద దొరికే వేణ్ణీళ్ళతోనే రాత్రి గడుపుతాను!" అంటూ లేవబోయాను. మావయ్య లేవలేదు.

"కాఫీ అయినా తాగుదాం రా!" అన్నాడు. ఎలాగయితేనేం. కాఫీ తాగి బయట పడ్డాం. చాలా ఆలస్యం అయింది. నాలుగు దగ్గరవుతూంది. మావయ్యకి ఆఫీసులో చాలా పని ఉంది. అతన్ని నా వెంట తిప్పుకోవడం భావ్యం కాదనిపించింది.

"ఇక నీవు వెళ్ళు, మావయ్యా! నే వెళతాను!" అన్నా.

"అయితే వెళ్ళు! జాగ్రత్త! దూరప్రయాణం. ట్రెయిన్‌లో నిద్రపోకు! వెళ్ళగానే ఉత్తరం రాయి" అంటూ కదిలాడు మావయ్య. నేను సిటీబస్ స్టాపు చేరుకున్నా. పదమూడవ నెంబర్ బస్ వచ్చింది. వాల్తేరు స్టేషన్ అని రాసి ఉంది దాని మీద. ఉదయం ఆ నంబర్ బస్ స్టేషన్‌లో చూశాను. గేటులో ఉన్న కండకర్టును అడిగా ఎందుకైనా మంచిదని..... "స్టేషన్‌కు వెళుతుంది కదండీ?" అని.

"ఆ" అన్నాడు యాధాలాపంగా.

బస్ కదిలింది. పదిహేను నిమిషాలు గడిచాయ్. కాలేజీ, హాస్పిటలు దాటి పెద్ద జంక్షన్‌లో ఆగింది. ఏదో సినీమా హాలుంది.. పెద్ద మేరుపర్వతంలా. అక్కడనుంచి కదిలింది.

"స్టేషన్ ఎంత దూరం ఉంటుందండీ?" పక్క సీటులో కూర్చున పెద్ద మనిషిని అడిగా. ఆయన నన్ను ఒకసారి ఎగాదిగా చూసి "ఎక్క డెక్కారు?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"మార్కెట్ దగ్గర!" అని చెప్పాను.

"ట్రెయిన్‌కి వెళ్ళాలా?" అడిగాడు సానుభూతి ప్రకటిస్తూ.

"అవున్సార్! గోదావరిలో బెజవాడ వెళ్ళాలి. చాలా అర్జంటు!" అన్నా గాబరాగా.

"డైరక్టు బస్ ఎక్కి వుంటే పది నిమిషాలలో స్టేషను చేరుకుని ఉండేవారు! ఈ బస్ వూరంతా తిరిగి స్టేషను చేరుకుంటుంది. ఇంకా కనీసం పావుగంట పైనే పడుతుంది. మీకు బొటాబొటిగా ట్రెయిన్ అందవచ్చు. కానీ టికెట్ తీసుకోవడానికి టైమ్ చాలదేమో!" సందేహం వెలిబుచ్చా డాయన.

చటాల్న లేచి నిలబడ్డా. ఆయన నా చేయి పట్టుకుని కూర్చొ పెట్టాడు.

"అదికాదు, సార్! ఈ ట్రెయిన్ మిస్సయితే నా జీవితం మారిపోతుంది.!" బావురుమన్నాడు.

"అధైర్య పడకండి! డైరక్టు బస్‌లో వెళ్లి ఉంటే ముందుగా చేరుకుని ఉండేవారని నా ఉద్దేశం! మీకు తప్పకుండా ట్రెయిన్ అందుతుంది." ధైర్యం చెప్పాడు.

అంతలో కండక్టరు వచ్చాడు. నాకు ఒళ్ళు మండింది.

"ఏమండీ! టికెట్ ఇచ్చేటప్పుడైనా చెప్పారు కాదు చాలా టైము పడుతుందని! గోదావరి కనుక మిస్సయితే నా బతుకే నాశనమవుతుంది!" దులిపేశా.

కండక్టరు ఏ మాత్రమూ చలించలేదు.

"ఎవరు, ఎక్కడికి, ఎందుకు వెళ్తారో మాకేం తెలుస్తుంది సార్! మేము అడుగుతామా? అడిగానా మీరు చెబుతారా? అయినా అది మా డ్యూటీ కాదు! పరవాలేదు లెండి, గోదావరి అందుతుంది!."

తాపీగా సమాధానం ఇచ్చాడు. అందుతుందని అందరూ అంటున్నారు కనుక నాకు కొంచెం ధైర్యం వచ్చింది.

బస్ ఆగీ ఆగడంతోనే దిగి స్టేషన్‌లోకి పరుగెత్తా. బుకింగ్ కౌంటర్లు చాలా ఉన్నాయ్. అన్ని చోట్లా పెద్ద క్యూలు. ఒక క్యూ దగ్గరకి వెళ్లి అడిగా.

"ఏ వూరు వెళ్తారు, మాస్టారూ?"

"రాజమండ్రి!" అన్నా డాయన.

"గోదావరికేనా?" అడిగా.

"అవు" నన్నాడాయన.

నా మనసు స్తిమిత పడింది. వారి వెనుకనే నిలబడ్డా. క్యూ పెద్దదిగానే ఉంది. బుకింగ్ క్లార్క్ శక్తివంచన లేకుండా క్లియర్ చేస్తున్నాడు. అతని సామర్థ్యానికి అభినందించవలసినదే. 'క్యూ' కదులుతుంది. "గోదావరి ఎక్స్‌ప్రెస్ పది నిమిషాల్లో బయలుదేరుటకు సిద్ధంగా ఉంది."అనౌన్సుమెంటు. నా ముందు మరో ఐదుగురు

ఉన్నారు. మరో ఐదు నిమిషాలు పట్టవచ్చు.

కౌంటరులో చేయి ఉంచి, "బెజవాడ ఒకటి!" అన్నా.

కౌంటర్ క్లార్క్ నా నుంచి డబ్బు తీసుకోలేదు. చికాగ్గా చూశాడు. తన ఏకాగ్రతకు భంగం కల్గినట్లుగా ఫీలయ్యాడు.

"ఇక్కడ కాదు, సార్!" అన్నాడు.

షాక్ తిన్నాను. నోట మాట రాలేదు.

"తప్పుకోండి సార్!" నా వెనుకనున్నతను తొందర చేస్తున్నాడు.

"ఏ కౌంటర్‌లో ఇస్తారు సార్!" ఆత్రతగా అడిగా.

"ఎంక్వైరీలో అడగండి, సార్!" అనేసి నా వెనుకనున్న పాసెంజరును ముందుకు రమ్మనట్టుగా తలూపాడు. నేను అక్కడనుండి తప్పుకోవాలి.

"కైండ్లీ లెట్ మి నో ది కౌంటర్ నంబర్?" అర్థించాను ఆందోళన పడుతూ.

"ప్లీజ్ ఆస్క్ ఎట్ ది ఎంక్వైరీ!" విసుగ్గా అదే సమాధానం ఇచ్చాడు.

నాకు సమాధానం ఇచ్చే అవసరంకానీ, బాధ్యతగానీ అతనికి లేకపోవచ్చు. కానీ సాటి మనిషికి సహాయపడాలనే మానవతా దృక్పథం అతనికి లేకపోవడం అత్యంత విచారకరం.

"అర్జంటుగా ఢిల్లీ వెళ్లాలి, సార్!" అన్నా వణికే స్వరంతో.

ఒక పిచ్చివాణ్ణి చూసినట్టు చూశాడు.

"బెజవాడ టిక్కెట్టు కావాలంటున్నారు! ఢిల్లీ వెళ్లాలంటున్నారు! ఇంతకీ ఎక్కడికి వెళ్లాలి?" ఎగతాళిగా అడిగాడు.

"ఎంక్వయిరీలో అడగండి, సార్! తప్పుకోండి! బండి బయలుదేరే టయిమవుతోంది!"

వెనుకనున్న పాసెంజరు విసుక్కున్నాడు.

విధిలేక అక్కడనుండి కదిలా.

ఎంక్వయిరీ వద్దనున్న క్లార్కుకి ఊపిరిసలపడంలేదు. ఒక ఫోన్ రిసీవర్ కుడిచేత్తో పట్టుకొని ఎడం చేతిలోకి మరో రిసీవర్‌ని తీసుకొని మాట్లాడుతున్నాడు. అవి చాలవన్నట్టు మూడో ఫోన్ మ్రోగుతుంది. కౌంటర్ దగ్గర పాసెంజర్లు ప్రశ్నలవర్షం కురిపిస్తున్నారు. అష్టావధానం చేస్తున్నాడా గుమాస్తా.

"సార్! బెజవాడకి టికెట్టు ఏ కౌంటర్‌లో ఇస్తారు?" నేను కూడా ప్రశ్నించా. అతను ఎవరికీ సమాధానం ఇవ్వడంలేదు. నా అదృష్టంకొద్దీ తోటి పాసెంజరు కౌంటర్ నంబరు చెప్పి పుణ్యం కట్టుకొన్నాడు. గబగబా ఆ కౌంటర్ దగ్గరికి పరుగెత్తా. అక్కడ ఉన్న క్యూని చూశాక మతి పోయింది. అడ్డంగా వెళ్లాలని ప్రయత్నం చేశాను. తోటి పాసెంజర్లు అబ్జక్టు చేశారు. ఇద్దర్ని టిక్కెట్టు తీసిపెట్టమని రిక్వెష్టు చేశా. "దయచేసి వెనక్కుపోయి నిలబడండి!" అని మర్యాదగా సూచించారు.

"ట్రెయిన్ ఐదు నిమిషాల్లో బయలుదేరబోతుందని అనౌన్సుమెంటు! క్యూలో నిలబడితే నా టర్ను వచ్చేసరికి కనీసం అరగంట అయినా పడుతుంది. నాలో నిస్పృహ ఆవరించింది. టికెట్ కొనడం అసాధ్యం అని తేలిపోయింది. అడ్డుతోవ త్రొక్కి ఈ ప్రయాణం చేయవచ్చు! అదే లాస్ట్ రిసార్ట్. బాధ్యతగల పౌరునిగా అలా చేయగూడదు. కానీ గత్యంతరంలేదు. టిక్కెట్టు కొనుక్కొనే ప్రయత్నాన్ని విరమించుకొన్నాను. మొహానికి పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకొని ఇతర మార్గాలను అన్వేషించసాగాను.

ఇంతలో "రామం!" అన్న పిలుపు వినబడింది క్యూల్లోంచి. అతని వైపు చూశా. ఆయనే!! మామయ్య ఆఫీసుకి వచ్చిన జానకిరామయ్యగారే. నా కంగారులోనూ, ఆత్రతలోనూ అంతవరకూ ఆయన్ని గమనించనేలేదు.

"మీరా సార్!" అన్నా ఆయన్ను సమీపిస్తూ.

"బెజవాడ కదూ!" అన్నారాయన కౌంటరులో చేయి పెడుతూ.

భగవంతుడు ప్రత్యక్షమయి "నీ కోరికేంటి?" అని అడిగినంత సంబరపడ్డాను.

"అవును సార్!" అన్నా ఆయన్ను పరీక్షగా చూస్తూ! ఆయన్ను ఎక్కడో ఇదివరకు చూసినట్లు గుర్తు. బాగా తెలిసినవారే అయి ఉండాలి. కాకపోతే నన్ను 'రామం'

అని ఎలా పిలవగలరు! నా పేరు రామ ప్రసాదరావు. మా ఇంట్లో అంతా రామం అని పిలుస్తారు. ఈయన ఎవరై ఉంటారు? ఆలోచిస్తున్నాను.

ఆయన టిక్కెట్టు తీసి నాకిస్తూ "పద! ట్రెయిన్ బయలుదేరే టైమయింది!" అన్నారు గబగబా అడుగులు వేస్తూ.

నేను డబ్బు తీయబోతుంటే "ముందు పద! తర్వాత ఇద్దువుగాని!" అన్నారు. నేను వారి వెనుక గబగబా అడుగులు వేసి ప్లాట్‌ఫారం చేరుకొన్నాను. మేం ఇద్దరమూ ట్రెయిన్ సమీపించేసరికి కదలబోతోంది. గబగబా ఎక్కేం. గుమ్మంలోనే నిలబడాల్సి వచ్చింది. ఎక్కడా అరంగుళం జాగాకూడా లేదు. అలాగే మనిషిని మనిషి అంటుకొని నిలబడ్డాం. ట్రెయిన్ వేగాన్ని పుంజుకొంది. ఆయన ఎవరై ఉంటారా? అన్న ఆలోచనలో పడ్డా.

"నీవు లెక్చరర్ వెంకటేశంగారబ్బాయివి కదూ!" అడిగారాయన.

"అవును సార్! మీరెవరో జ్ఞప్తికి రావడం లేదు! క్షమించాలి!" అన్నా సిగ్గుపడుతూ.

"నేనూ మీ నాన్నా చిన్ననాటి స్నేహితులం. మీరూ మేమూ రాజమండ్రిలో ఒకే ఇంట్లో అద్దెకి ఉండేవాళ్లం. అప్పుడు మీరు చిన్న పిల్లలు! అమ్మ గారూ నాన్నగారూ బావున్నారా?ఎక్కడ ఉంటున్నారు?" అడిగాడు ఆప్యాయంగా.

"లేదు సార్! నాన్నగార్కి రాజమండ్రి నుంచి బెజవాడ ట్రాన్స్‌ఫర్ అయింది! అక్కడికి వెళ్లిన ఆరేళ్లకి నాన్నగారు పోయారు! మేం ప్రస్తుతం అక్కడనే ఉంటున్నాం!" చెప్పాను.

ఆయన చాల నొచ్చుకొన్నాడు. నాన్నగారి గుణగణాలని వర్ణించి చాల బాధపడ్డారు.

"నాకు ఢిల్లీలో ఉద్యోగం అయింది సార్! డ్యూటీలో జాయిన్ కావాలి! మీ ఆఫీస్ యూ.డి. ఎకౌంటెట్ విశ్వనాథంగారు మా మేనమామగారే! అతని దగ్గర డబ్బుతీసుకొని వెళ్తున్నా!" చెప్పాను.

"చాల సంతోషం, బాబూ!" ఆనందించారాయన. "రేపు బెజవాడలో ఉదయం

జయంతీ జనతాకి బెర్త్ రిజర్వు చేయించుకొన్నా! ఈ ఎక్స్‌ప్రెస్ మిస్సయితే రాక రాక వచ్చిన ఉద్యోగవకాశాన్ని పోగొట్టుకొని ఉండేవాణ్ణి! వెరీ కైండాప్ యూ సార్! మీ ఉపకారాన్ని ఈ జన్మలో మర్చిపోలేను!" మరోసారి కృతజ్ఞతలు తెలుపుకొన్నా.

"మనిషికి మనిషి సహాయం చేసుకోకపోతే ఎలా, బాబూ! మానవుడు చేసే ప్రతి పనీ మంచిదైనా, చెడ్డదైనా అంతా భగవత్ప్రేరణవలనే జరుగుతుంది. ఆఖరికి మాట సహాయం కూడా. మనం ఒట్టి నిమిత్త మాత్రులం!".

తేలిగ్గా కొట్టిపారేశారు జానకిరామయ్యగారు. ట్రెయిన్ స్పీడుగా వెళుతోంది. పాసెంజర్లు అటూ ఇటూ సర్దుకోవడంతో ఇరకాటం కొంత తగ్గింది. ఆయనా, నేనూ కూర్చోడానికి జానెడు స్థలంకోసం అన్వేషణ ప్రారంభించాం. ఆ అన్వేషణలో ఇద్దరమూ ఎడం అయ్యాం. ఆయనకు తుని దాటాక కూర్చొందుకు స్థలం దొరికింది. నన్ను పిలిచారు. సర్దుకొని కూర్చుందాం అన్నారు. నేను కూడా ఆ ఇరుకులో కూలబడ్డాను. బాగా రాత్రి అయింది. ఆయన తన గోడు చెప్పుకొన్నారు.

వాళ్లమ్మాయి పెళ్లి పదహారో తారీఖునట! అంటే ఇక వారం రోజులు మాత్రమే

వ్యవధి ఉంది. కట్నం డబ్బు వారం రోజులు ముందుగా ఇస్తానని వాగ్దానం చేశారుట, ప్రావిడెంటు ఫండ్ నుంచి విత్‌డ్రాయలుకు అప్లయిచేసి మూడు వారాలయింది, ఇంకా శేంక్షన్ కాలేదుట. క్రిందటి వారం వెళ్లినప్పుడు ఆఫీసరు కాంప్‌లో ఉన్నారన్నారట! రెండు రోజుల క్రితం వెళితే ఆఫీసరుగారి సంతకం కాలేదని చెప్పారుట, హైదరాబాద్‌లో ఉన్న వాళ్ల పెద్దమ్మాయి ఉత్తరం రాసిందిట! సమయానికి కట్నం డబ్బు దొరక్కపోతే తన నగలు తాకట్టు పెట్టి తీసుకొని వెళ్లమందట. ఆడపిల్ల నగలు ఎందుకు తాకట్టు పెట్టడం అని అంతవరకు ఆగారట! ఇక గత్యంతరం లేక డబ్బు కోసం అమ్మాయి దగ్గరికి హైదరాబాదు వెళ్తున్నారట.

ఆయన పరిస్థితి తెల్సుకొని చాలా విచారించాడు. వారికి డబ్బు సాంక్షన్ అయిందనీ, మర్నాడు శాంక్షన్ ఆర్డరు అందుతుందనీ, హైదరాబాద్ వెళ్లడం, ఆడపిల్ల నగలు తీసుకోవడం అనవసరం అనీ చెప్పాలనుకొన్నాను. కానీ చెప్పలేకపోయాను. వారి ఆఫీసు విషయాలు నాకెందుకు? ఆ తర్వాత ఆయనకే తెలుస్తుంది అనుకొన్నా.

ఆయన వైపు చూశా... బడలికగా ఉన్నారు. రెప్పవాల్చారు. నిద్రవస్తుంది కాబోలు! నాకు నిద్ర రాలేదు. నా భావి జీవితం గురించి ఒకటే ఆలోచన.

బెజవాడ వచ్చింది. నేను దిగాను. ఆయన నన్ను వెనక్కు పిలిచారు. కిటికీ దగ్గరకెళ్ళి "నే వస్తాను, సార్, సెలవ్!" అన్నా.

"నీ జీవితం దేదీప్యమానంగా వెలగాలని ఆకాంక్షిస్తున్నానోయ్!" అన్నారు.

"వెరీ మెనీ థాంక్స్, సార్!" వారి విశాల హృదయానికి నా హృదయం ద్రవించింది. అడుగులు పడలేదు. హైదరాబాదు వెళ్లనవసరం లేదని చెప్పాలనిపించింది. కానీ చెప్పలేకపోయాను. మావయ్య అన్నట్లు అది ఆఫీస్ విషయం కాదు. ప్యూర్లీ పర్సనల్! అయినా చెప్పాలంటే పెదవి కదల్లేదు. ఆయన అన్నట్లు భగవత్ప్రేరణ కాబోలు!

నేనూ నిమిత్త మాత్రుణ్ణే !

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

9-4-1980